క్లుప్తంగా

భూమన నివాళి



గుడిపల్లి అరుణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మాతృమూర్తి గుడిపల్లి అరుణమ్మ చిత్రపటానికి చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. అరుణమ్మ శుభస్వీకరణ సందర్భంగా ఆదివారం వారు భానుప్రకాష్‌రెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పలువురు ప్రముఖులు సైతం..

తిరుపతి అన్నమయ్యసర్కిల్: కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్, రాష్ట్ర రవాణాశాఖమంత్రి రాంప్రసాద్‌రెడ్డి. టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు. కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ ఈఓ శ్యామలరావు, బోర్డు సభ్యురాలు ప్రశాంతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీసిటి చైర్మన్ రవి సన్నారెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు. జనసేన నేత హరిప్రసాద్, వివిధ ప్రాంతాల ఎమ్మెల్యేలు, పలువురు టీటీడీ ఉద్యోగులు సైతం భానుప్రకాష్‌రెడ్డిని పరామర్శించారు.

'మొబైల్ అంబ్రెల్లాస్' ప్రారంభం



ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్ : ట్రాఫిక్ పోలీసుల సౌకర్యార్థం 20 మొబైల్ అంబ్రెల్లాస్‌ను ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదివారం పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ప్రారంభించారు. ట్రాఫిక్ సిబ్బందికి మెరుగైన వాతావరణం కల్పించేందుకు వీటిని ప్రారంభించామని పేర్కొన్నారు. మొదటి దశలో తనపల్లె, ఆర్‌సీపురం, వార్త క్రాస్, మామిడికాయల మండీ, గరుడ సర్కిల్‌లో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ ఆచారి పాల్గొన్నారు.

'ఫిట్ ఇండియా–ఫైట్ ఒబిసిటీ'పై ర్యాలీ

తిరుపతి క్రైమ్ : ఫిట్ ఇండియా ఫైట్ ఒబిసిటీలో భాగంగా తిరుపతిలోని పూర్ణకుంభం సర్కిల్ నుంచి చింతల చేను వరకు అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ ఆచారి ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

'వెటర్నరీ'లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



బ్యాడ్మింటన్ పోటీలో తలపడిన విద్యార్థులు

చంద్రగిరి: శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం –2025ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వ్యాయామ క్రీడా విభాగాధిపతి ప్రొఫెసర్ జయచంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాడ్మింటన్, ఉద్యోగస్తులకు టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించారు. తిరుపతిలోని పలు కళాశాల విద్యార్థులు, వివిధ కార్యాలయ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని డాక్టర్ సుదీర్, విద్యార్థులు సూర్య, పల్లవి, ప్రసన్న, ఆనంద్, యశ్వంత్ నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి కళాశాల అసోసియేట్ డీన్ జగపతి రామయ్య జ్ఞాపికలను అందజేశారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ దృష్టికి సమస్యలు



వినతి పత్రం ఇస్తున్న బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: బ్రాహ్మణుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుజ్జిరామ్‌ప్రసాద్‌కు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలో చైర్మన్‌ను సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కామేశ్వరప్రసాద్, బలరామకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్, ఇతర ప్రతినిధులు ఆదివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. సబ్సిడీ రుణాలను ఇవ్వాలని, రుణం అదనపు షేర్ మొత్తాన్ని కనీసం వడ్డీ లేదా డివిడెంట్ లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాలకు సంబంధించి ధూప దీప నైవేద్యాలు సక్రమంగా అందడం లేదని నివేదించారు. నెల్లూరు పట్టంలోని కాశీ విశ్వేశ్వర కర్మక్రియల భవనం స్థలం పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు, కోశాధికారి ఉమామహేశ్వరరావు, తిరుపతి, కడప, నెల్లూరు, చిలకలూరుపేట, కృష్ణా జిల్లాలోని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వన్ బై టు..!

ఒకే పంచాయతీ.. ఇద్దరు కార్యదర్శులు.. ఒకరు డిప్యూటీ ఎంపీడీఓ ఒక్కరైతే.. మరొకరు గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శి. ఆ ఇద్దరూ అడపాదడపా పంచాయతీ కార్యాలయానికి వచ్చినా విధులు నిర్వర్తిస్తున్నారా?.. అంటే లేదనే చెప్పాలి. దీనిపై ప్రశ్నిస్తే– పంచాయతీ సిబ్బందికి జీతాలు పెట్టడం వరకే తన బాధ్యత అని ఒకరు, అదనపు బాధ్యతలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు రాలేదని మరొకరి సమాధానం! ఇలా ఒకటిన్నర నెలగా ఆ పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడంతో పంచాయతీలో ఎక్కడి పనులు నిలిచిపోతున్నాయని సర్పంచ్, ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

- ఒకే పంచాయతీ.. ఇద్దరు కార్యదర్శులు!
- విధులకు వచ్చినా ఏ పనీ చేయని వైనం..!
- జీతాలు పెట్టడం వరకే తన పని ఒకరు
- అధికారికంగా ఉత్తర్వులు రాలేదని మరొకరు
- గాంధీపురం పంచాయతీలో తిష్ట వేస్తున్న సమస్యలు



గాంధీపురం పంచాయతీ కార్యాలయం

తిరుపతి రూరల్: మండలంలోని గాంధీపురం పంచాయతీ విస్తృతి ఎక్కువ. దీనికితోడు ఈ మండలంలో అధికంగా మఠం భూములు ఉన్నాయి. తరచూ ఆ భూములపై వివాదాలు, సమస్యలు ఉత్పన్నమవుతూ అధికారులకు బొప్పి కట్టిస్తున్నాయి. మరోవైపు పంచాయతీలో ఇళ్ల నిర్మాణాలు, కాలనీలు విస్తరిస్తూండడంతో పంచాయతీలో చేయవలసిన అభివృద్ధి పనులు చాలానే ఉన్నాయి. ఇక, శానిటరీ వర్కర్లు ఏడాది కాలంగా జీతాలు సక్రమంగా రాకపోవడంతో ఇటీవలే ఆందోళన సైతం చేశారు. ఈ సమస్యను పరిష్కరించడానికి జిల్లా అధికారులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి కలిగింది. పంచాయతీ పరిస్థితులు ఇలా ఉంటే, పంచాయతీకి కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న లతశ్రీ ఇటీవల పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో ఆ బాధ్యతల నుంచి తప్పించారు. అయితే రెగ్యులర్ కార్యదర్శిని నియమించకపోవడంతో కార్యదర్శిని నియమించేంత వరకు ఆమెనే చూసుకోవాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెండు నెలలుగా ఆ పంచాయతీ కార్యాలయానికి వచ్చి వెళ్లే కార్యదర్శి లతశ్రీ అధికారికంగా ఉత్తర్వులు రాకపోవడంతో ఎక్కడా సంతకం చేయడం లేదు. కనీసం పంచాయతీ కార్యదర్శుల జీతాల విషయంలో కూడా ఆమె సంతకం చేయకపోవడంతో మూడు నెలల జీతాలు ఆగిపోయాయి. దీంతో ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో స్థానిక ఎంపీటీసీ జయకర్, సర్పంచ్ మన్నూరు లక్ష్మి అధికారులను నిలదీశారు. ఆగమేఘాలపై డిప్యూటీ ఎంపీడీఓ దయాసాగర్‌కు ఆ పంచాయతీ కార్యదర్శి బాధ్యతలను అప్పగించారు. దీంతో ఆయన ఆ కార్యాలయానికి వెళ్లి ఒకనెల వరకు జీతం బిల్లులు పెట్టి వెళ్లారు. అదనపు బాధ్యతల నేపథ్యంలో మిగతా ఫైళ్లపై సంతకం చేసి వాటికీ మోక్షం కల్పించాలని సర్పంచ్ కోరినప్పటికీ ఆయన ససేమిరా అంటున్నారు. తనకు జీతాల వరకే బాధ్యత అప్పగించారని చెప్పడం, మరో కార్యదర్శి లతశ్రీ తనకు అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వనప్పుడు తాను ఫైళ్లలో సంతకం చేయనని స్పష్టీకరించారు. ఫలితంగా ఆ పంచాయతీలో ఎక్కడిపనులు అక్కడే ఆగిపోతున్నాయని, ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని సర్పంచ్ వాపోతున్నారు. జిల్లా స్థాయి అధికారులు ఇకనైనా రెగ్యులర్ కార్యదర్శిని నియమించి ఈ సమస్యలకు తావివ్వకుండా చేయాలని కోరుతున్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించండి

–ప్రభుత్వాన్ని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జగన్నాథం

తిరుపతి సిటీ: రాష్ట్రంలో పెండింగ్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిరాశకు గురవుతున్నారని, ఇకనైనా వెంటనే చెల్లించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జగన్నాథం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బైరాగిపట్టెడలోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా ద్వితీయ స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో టీచర్ల పెండింగ్ బకాయిలపై కూటమి ప్రభుత్వం నాన్చివేత ధోరణితో ఉంటోందని విమర్శించారు. సమావేశంలో అధ్యక్షులు కే.రమేష్ బాబు, ఆర్థిక కార్యదర్శి కతారి మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యాయ వాణి సంపాదక కార్యవర్గ సభ్యులు గురు ప్రసాద్, జిల్లా మహిళా కార్యదర్శి రేణుకాదేవి, కౌన్సిలర్లు రామాంజనేయులు, మిఠాయి వేణుగోపాల్, హరికృష్ణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు మల్లేశ్వర్, గుమ్మడి మురళి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి దేవేంద్ర, శ్యామసుందర్, వాసు, వెంకటరమణ, చెంచురత్నం, సుధాకర్, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ కార్యాలయాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి

తిరుపతి కల్చరల్: కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తుడా మైదానంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని వినాయక ఉత్సవ కమిటీ కార్యాలయాన్ని ఆదివారం సందర్శించారు. వినాయక స్వామికి పూజలు చేసి ఆయన మాట్లాడారు. తిరుపతిలో వినాయక నిమజ్జనోత్సవ కమిటీ ఏర్పాటు చేసి ప్రభుత్వ శాఖల సమన్వయంతో వినాయక చవితి వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు పూనుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీటీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్‌పీఎస్ పాఠశాల ఆవరణలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశం మండల బీటీపీ అధ్యక్షుడు కె.జ్యోతిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. బీటీపీ జాతీయ ఉపాధ్యక్షుడు జి.ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామమూర్తి మాట్లాడారు. 12వ పీఆర్సీ కమిటీని నియమించి ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, 11వ పీఆర్సీ అరియర్స్ బకాయిలు, రావలసిన 3 డీఏలను వెంటనే ప్రకటించి విడుదల చేయాలన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని విమర్శించారు. కార్యక్రమంలో బీటీపీ నాయకులు ఆదికేశవులు, కృష్ణమూర్తి, జయబాల, తులసీరాం, బంగారురాజు, విజయమోహన్, గోపాలయ్య, సుబ్బయ్య, గిరి, గోపి, జ్యోతి, వెంకటరత్నం పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే ముస్లిం, మైనారిటీల సంక్షేమం

- ముస్లింలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వం



ముస్లిం, మైనారిటీ నగర నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను ఇస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: ఐదేళ్ల జగనన్న పాలనలో ముస్లిం, మైనారిటీలకు పలు సంక్షేమ పథకాల ఫలాలు దరిచేర్చడంతోపాటు ఉన్నత పదవులను కేటాయించిన ఘనత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం ముస్లిం, మైనారిటలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ముస్లిం, మైనారిటీ తిరుపతి నగర అధ్యక్షులు మహ్మద్‌ఖాసీం బాషా(చోటాబాయ్) ఆధ్వర్యంలో నగర నూతన కార్యవర్గాన్ని నియమించి నియామకపత్రాలను అందజేసి మాట్లాడారు. నూతన కార్యవర్గం పార్టీ బలోపేతానికి బాధ్యతగా పనిచేయాలని మార్గదర్శనం చేశారు. దివంగత నేత డాక్టర్ వైఎస్సార్, జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆ వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి, అమలు చేసిన పథకాల గురించి వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ముస్లింలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని మండిపడ్డారు. చంద్రబాబు నిలువునా దగా చేశారని, ప్రజాసంక్షేమం కన్నా వైఎస్సార్‌సీపీ నాయకులపై ప్రతీకారమే ప్రధానమనే విధంగా పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు షయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరీ, పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ ముస్లిం, మైనారిటీ నాయకులు షేక్ ఇమామ్ సాహెబ్, షేక్ ఇమ్రాన్ బాషా, ఖాదర్‌బాషా, గఫూర్, ఛాన్‌బాషా, ఫరీద, సలీం, షర్మిల, మౌల, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

'తానా' బహుమతులు పొందిన బాలల నవలలు ఆవిష్కరణ



తిరుపతి కల్చరల్: రచయితలు ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు, పేట యుగంధర్ రచించిన 'మునికిష్టడి మాణిక్యం', 'జాను అను నేను–నాస్నేహితురాళ్లు' నవలలను ఎస్వీ వేదిక్ వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ప్రతిష్టాత్మక తానా అంతర్జాతీయ సాహిత్య సంస్థ (అమెరికా) నిర్వహించిన తాను–మంచి పుస్తకం బాలల నవలల పోటీలో బహుమతిని ఈ పుస్తకాలు పొందాయి. ఆచార్య పీసీ.వెంకటేశ్వర్లు ×జాను అనే నేను–నాస్నేహితురాళ్లు₹ పుస్తకాన్ని సమీక్షించారు. సమకాలీన బాల సాహిత్యంలో సామాజిక స్పృహ, చదువు ప్రాముఖ్యతను, ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన విశిష్టతను తెలియజేసే గొప్ప నవలగా అభివర్ణించారు. మునికిష్టడి మాణిక్యం నవలను డాక్టర్ జి.లక్ష్మీప్రియ సమీక్షిస్తూ..రచయిత పుత్తూరు శల్య వైద్య కట్టు ప్రాముఖ్యతతో పాటు స్థానిక జన జీవితాన్ని హాస్య భరితంగా పరిచయం చేశారని విశ్లేషించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు జొన్న విత్తుల రామచంద్రమూర్తి, ఆకుల మల్లేశ్వరరావు, డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, డాక్టర్ వీఆర్.రాసాని, కొత్వాల అమరేంద్ర, జిల్లేళ్ల బాలాజి, తోట వెంకటేశ్వర్లు, నెమిలేటి కిట్టన్న, మన్నవ గంగాధర్‌ప్రసాద్, మల్లారపు నాగార్జున, కేవీ.మేఘనాథ్‌రెడ్డి, పల్లిపట్టు నాగరాజు, డాక్టర్ యువశ్రీ, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సురేంద్ర రొడ్డ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న చిరంజీవి

తిరుపతి సిటీ: మాక్స్‌వెల్ కేర్ ఫౌండేషన్ ద్వారా తిరుపతిలో ఉచిత డయాగ్నోస్టిక్ హెల్త్ కేర్ ఏటీఎంతో సేవలందిస్తున్న ఘటం చిరంజీవికి అమెరికన్ స్టేట్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. చెన్నై భారతీయ విద్యాభవనంలో ఆయన డాక్టరేట్ అందుకున్నారు. మాక్స్ ఫౌండేషన్ సభ్యులు, పలువురు ఆయన్ను అభినందించారు.

నగరంలో నేడు

- తుడా కార్యాలయంలో ఉదయం 10 గంటలకు అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష.
- కలెక్టరేట్ వద్ద ఉదయం 10 గంటలకు వికలాంగుల జాతీయ హక్కుల వేదిక ధర్నా.
- తిరుపతిలోని శ్రీపద్మావతి బాలికల ఉన్నత పాఠశాల, శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు.

యాదవులకు కళంకం తెస్తున్న కూటమి ప్రభుత్వం

- కృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహం వద్దు
- టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్ మండిపాటు



తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హిందూ సంప్రదాయాలు, హైందవ జాతిని మంటగలుపుతున్నారని, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ, యాదవ కులానికి కళంకం తెస్తోందని తిరుపతి టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి వాసుయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి పద్మావతిపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హైందవ మత ప్రతిష్టను మంట కలుపుతోందని మండిపడ్డారు. గుంటూరు జిల్లాలో నందమూరి తారక రామారావు విగ్రహాన్ని తెలుగుదేశం పార్టీ ఆవిష్కరించిందని, దీనికి తాము వ్యతిరేకం కాదని, అయితే ఈ ప్రపంచానికి భగవద్గీత అందించిన శ్రీకృష్ణ భగవానుని రూపంలో రామారావును ఆవిష్కరించడం..యాదవ కులానికి, ప్రపంచవ్యాప్తంగా శ్రీకృష్ణుని భక్తులకు అవమానంగా తాము భావిస్తున్నామన్నారు. రామారావు రామునిగా, రావణాసురుడిగా, దుర్యోధనుడిగా, కీచకుడిగా, అర్జునుడిగా, భీముడిగా, భీష్ముడిగా ఆఖరికి బృహన్నలగా కూడా నటించారని, ఆ వేషధారణల్లోనే కాకుండా శ్రీరాముడి వేషధారణలో రామారావు విగ్రహావిష్కరణ చేసే దమ్ము టీడీపీకి ఉందా? అని ప్రశ్నించారు. వెంటనే ఆ విగ్రహాన్ని తొలగించి శ్రీకృష్ణ భగవాన్ భక్తులకు, యాదవులు, హైందవ జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

మానవాళి మనుగడకు వృక్షసంపదే ఆధారం

రామచంద్రాపురం: మానవాళి మనుగడకు వృక్షసంపదే ప్రధాన భూమిక పోషిస్తాయని ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ అన్నారు. ఆదివారం మండలంలోని రాయలచెరువు కట్ట సమీపాన యోగుల పర్వతంపై ఔషధ గుణాలు కలిగిన రావి, వేప, మర్రి, మారేడు వంటి మొక్కలను నాటేందుకు శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ, సామాజిక అడవుల పెంపకం వలన ఆవాస ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని, వన్యప్రాణులకు బాసటగా నిలుస్తాయన్నారు. సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏకవీర సేవా ఫౌండేషన్ సభ్యులు శివ, ప్రవీణ్, గంగాధర్, వెంకటేష్, సాయి, సదా, హరి పాల్గొన్నారు.

నేడు జీఎస్‌టీ, ఇన్‌కంటాక్స్ చట్టాలపై అవగాహన సదస్సు

తిరుపతి కల్చరల్: జిల్లా టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హోటల్ ఉదయ్ ఇంటర్నేషనల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీఎస్‌టీ, ఇన్‌కంటాక్స్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి పన్నుల వసూళ్లపై ఆధారపడి ఉంటుందని, ఈ నేపథ్యంలో మారుతున్న కాలానికి అనుగుణంగా జీఎస్‌టీ, ఇన్‌కంటాక్స్‌లో చట్టాల్లో వస్తున్న మార్పులపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ దిశగా ప్రముఖ నిపుణులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని, జిల్లాలోని టాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెన్స్ హాజరు కావాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎంఏ.సునీల్ అహ్మద్, ఎస్.అరుణ్‌కుమార్, ఆర్.మునిక్రిష్ణయ్య, ఆర్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం



పూర్వ వలంటీర్లతో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

- పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ పూర్వ వైభవం
- తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలకన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చిన గొప్ప నాయకుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. తిరుపతి 41వ వార్డులో ఆదివారం పూర్వపు వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగనన్న పాలనలో ప్రజలకు వలంటీర్లు అందించిన సేవలు అమోఘమని కొనియాడారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే అవసరం లేకుండా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు క్యూలలో నిలబడే పరిస్థితి లేకుండా ఇళ్ల వద్దకే అన్ని సేవలూ అందించిన ఘనత వలంటీర్లదేనన్నారు. అయితే, తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు నెలకు రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన చంద్రబాబు తన హామీ నెరవేర్చడానికి బదులు ఏకంగా వలంటీర్ల వ్యవస్థకే మంగళం పాడారని విమర్శించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి, పథకాలకు కూటమి పాలనలో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అష్టకష్టాలు పడుతున్నారని, వలంటీర్ల సేవలను గుర్తు చేసుకుంటూ ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ వలంటీర్లకు పూర్వ వైభవం వస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకుడు రాజేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన హర్షిత్‌రెడ్డి



మల్లెల చెరువు పంచాయతీలో మోహన్ రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న హర్షిత్‌రెడ్డి



బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి తల్లి అరుణమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తూ..

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైఎస్ఆర్‌సీపీ నేతల కుటుంబీకులను చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మండలంలో గాంధీపురం పంచాయతీకి చెందిన మాజీ వార్డు సభ్యులు దయాల్ తండ్రి పెంజచారం హఠాన్మరణం చెందడంతో నివాళులు అర్పించారు. అనంతరం ఇటీవలే మరణించిన పాకాల మండలం మల్లెలచెరువుకు చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు మునిరత్నం రెడ్డి బావమరిది మోహన్‌రెడ్డి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. అనంతరం నాగాపురంలో వైఎస్ఆర్‌సీపీ యువనేత కొండా శివ తాతయ్య కొండా చెంగయ్య దశదినకర్మక్రియలకు హాజరయ్యారు. కార్యక్రమంలో గాంధీపురానికి చెందిన మన్నూరు శివ, ముని, పాకాల మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, నేతలు హరిప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, కపిలేశ్వరరెడ్డి, రహీం బాయ్, వినాయక, లోకనాథంరెడ్డి, మునీర్, జ్యోతిరెడ్డి, సురేష్, భానుప్రసాద్, వాసు, రాజేష్, ఈశ్వరయ్య, బాబురెడ్డి, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో..

తిరుపతిలో టీటీడీ పాలక మండలి సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి తల్లి అరుణమ్మ దశదిన కర్మక్రియలకు కూడా చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాలులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, పార్టీ నేతలు అశోక్‌రెడ్డి, మల్లెమొగ్గల ఉమాపతి, హరిప్రసాద్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యుదయ వాది అన్నమయ్య

–అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ లత



అన్నమయ్య సంకీర్తనల ఆల్బం ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: సమాజంలోని అసమానతలను తన పదాలతో నిరసించిన అభ్యుదయ వాది అన్నమయ్య అని అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సి.లత కీర్తించారు. విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంతో కేటీ రోడ్డులోని అరవింద సొసైటీలో ×శ్రీవారి సంకీర్తన వసంత వరప్రసాదిని₹ అన్నమయ్య సంకీర్తనల ఆల్బం ఆవిష్కరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా లత ఈ అల్బంను ఆవిష్కరించి మాట్లాడారు. అన్నమయ్య భక్తి సంకీర్తనలతో పాటు జానపద, ఆధ్యాత్మిక, శృంగార సంకీర్తనలను అందరికీ అర్థమయ్యే రీతిలో రచించారని, ప్రతి నోటా అన్నమయ్య కీర్తనలు వినిపించేలా తమ ప్రాజెక్టు కృషి చేస్తోందన్నారు. 70 ఏళ్ల వయస్సులో తలుపూరు వెంకట శేష వరప్రసాద్ అన్నమయ్య సంకీర్తనలను నేర్చుకుని, స్వయంగా గానం చేసి, ఆల్బం రూపొందించడం అభినందనీయమన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత రామస్వామి రఘుపతి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక చింతన, యోగ సాధనతో జీవితాలను సుఖమయం చేసుకోవడానికి అన్నమయ్య సంకీర్తనలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. అనంతరం విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కే.సుబ్రమణ్యం కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీటీడీ బ్రాడ్ కాస్టింగ్ ఏఈ మల్లం విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రముఖ రంగస్థలి నటుడు బొందు రామచంద్రారెడ్డి, స్వరభారతి ప్రధాన కార్యదర్శి కొమాండూరి శరద్యుతి, ప్రముఖ గేయ రచయిత జిల్లేళ్ల ప్రసాద్, కళాకారులు నాయని మధు, రమ్యకృష్ణ, రాగసుధ, గంగులప్ప, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్యం



చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెన్నైకు చెందిన శ్రీహరి అభినయ కృష్ణ భరతనాట్య ఇసైపల్లి ఆధ్వర్యంలో చిన్నారుల భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గణపతి కౌతువం, ఆడం చిదంబరం, మూషిగ, జగత్ జాలు, పుష్పాంజలి, తిరుపుగజ్, అలరిప్పు, తదతగై తాండవం, సీతా కల్యాణం, శిలపతికారం.. తదితర పాటలకు కళాకారులు రక్షిత, ధన్య, సాయిజన, దియాడి జూటూరు, కావ్యశ్రీ, జయతి, వెన్నిక, అక్షర, లితిక, మురళీకృష్ణన్, కనిష్క, కృత్తిక తమ చక్కని అభినయం, హావభావాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ఏఓ సూర్యతేజ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

నేటి నుంచి 'శ్రీకంచి కామాక్షి జాతక పరివర్తన'

తిరుపతి కల్చరల్: కంచి కామకోటి శంకరమఠంలోని శ్రీమహా పాదుకా మండపంలో ఈనెల 25న సోమవారం నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీకంచి కామాక్షి జాతక పరివర్తన నిర్వహిస్తున్నట్లు శ్రీకంచి మఠం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వివాహ సంబంధిత జాతక పరిశీలన, నూతన వధూవరుల జాతకాలు, సంబంధాలు పరిశీలనానంతరం వివాహ సంబంధాలు సూచించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 8106140031, 6302062692 నంబర్లను సంప్రదించాలని కోరారు.